క్లుప్తంగా

దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కౌతాళం: దూదేకులు రాజకీయ, విద్య, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే తమ కులానికి తగిన గుర్తింపు ఉంటుందని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సాయిబాబా అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో బుధవారం దూదేకుల కులస్తులతో కలసి ఈ నెల 29న గుంటూరులో నిర్వహించనున్న దూదేకుల సింహగర్జనను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దూదేకుల కులస్థులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని చట్ట సభల్లో తగిన ప్రధానం ఇవ్వాలని కోరారు. తమకు సముచిత స్థానం కల్పించే రాజకీయ పార్టీకే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామన్నారు. మండల కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, దూదేకుల సంఘం నాయకులు అంగడి నబిసాబ్, టిప్పుసుల్తాన్, రషీద్, రాజసాబ్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

పెద్దకడబూరు: ఎమ్మిగనూరులో గురువారం జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శిలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు సీఎం వైఎస్ జగనన్న సభకు బయలుదేరేలా తగు ఏర్పాట్లు చేశామన్నారు. ఎవ్వరికీ ఏ ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉద్యోగులకు సూచించారు. నాయకులు రవిచంద్రరెడ్డి, జాము మూకయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు సన్మానం

ఆదోనిటౌన్: ఆదోని ఆర్టీసీ డిపోలో సత్ప్రవర్తనతో మెలుగుతూ సంస్థకు, ప్రయాణికులకు మేలుచేసిన కండక్టర్, డ్రైవర్లను ఆదర్శ ఉద్యోగులుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. బుధవారం డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు వీరేష్, షరీఫ్, బీఎండీ షరీఫ్, నగేష్, సత్ప్రవర్తనతో విధులు నిర్వహించిన కండక్టర్లు వీరేశప్ప, క్రిష్టయ్య, హంపయ్యతో పాటు ఉరుకుంద జాతరలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు మహేశప్ప, కార్తవరాయుడు, రామలింగప్ప, పరమేశప్ప, పార్వతీశం, చెన్నకేశవ, రమేష్‌లను శాలువాలు వేసి డీఎం మహ్మద్‌రఫిక్ సన్మానించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు బహుమతులను అందజేశారు. సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పి.రమేష్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ , ఎస్టీ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాడు-నేడు కింద వసతి గృహాలను అభివృద్ధి చేయాలని కోరారు. పశ్చిమ ప్రాంతంలో వలసలు నివారించి విద్యార్థులకు అన్ని రకాల ఫీజుల్లో రాయితీ కల్పించాలన్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అన్నిరకాల కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు

288 మద్యం బాటిళ్లు స్వాధీనం

మంత్రాలయం: కర్ణాటక నుంచి ఏపీకి 288 కర్ణాటక మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మాధవరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదోని పట్టణానికి చెందిన భీమన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా గిలకసూగూరు క్యాంప్ నుంచి ద్విచక్ర వాహనంపై 288 మద్యం బాటిళ్లు (మూడు బాక్స్‌లు) తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి వ్యక్తిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి మద్యంను సీజ్ చేసినట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

మాదిగ విశ్వరూప పాదయాత్ర ప్రారంభం

ఆదోనిరూరల్: మండలంలోని విరుపాపురం గ్రామం నుంచి బుధవారం మాదిగల విశ్వరూప పాదయాత్ర ఘనంగా ప్రారంభమైంది. ఆదోని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ జగన్ సుధాకర్ యాత్రను ప్రారంభించి మాట్లాడారు. నవంబర్ 7వ తేదీన హైదరాబాదులో జరగబోయే కార్యక్రమంలో లక్షలాది మంది యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రాజు, నాగరాజు, జయన్న, విజయ్, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం.. సురక్ష ధ్యేయం





ఆదోనిలో వైద్య శిబిరంలో సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, పాదలకుంట శిబిరంలో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆదోనిటౌన్: ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వం వైద్యసేవలు అందిస్తోందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి పేదోడికి కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. బుధవారం పట్టణంలోని 33వ వార్డులో పాండురంగస్వామి కళ్యాణ మండపం, 40వ వార్డులో ఈశ్వర దేవాలయం మండపంలో వేర్వేరుగా వైద్య శిబిరాలను నిర్వహించారు. 40వ వార్డు శిబిరాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత ప్రారంభించారు. 33వ వార్డులో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కౌన్సిలర్ అంజినమ్మ ప్రారంభించారు. ఆయా శిబిరాల్లో వైద్యులు పరీక్షలు, ఏఎన్ఎంలు, ట్రైనింగ్ నర్సులు, ఆశావర్కర్లు ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వివరాలను తెలుసుకొని వారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం మందులను అందించారు. ఈశ్వర మండపంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి శిబిరంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను పర్యవేక్షించారు. డాక్టర్లు, సిబ్బంది ఏయే పరీక్షలు చేస్తున్నారు, మందులు అందరికీ పంపిణీ చేస్తున్నారా లేదా పరిశీలించారు. అంగన్‌వాడీ స్టాల్స్‌లో వివిధ రకాల వంటకాలను రుచి చూశారు. వార్డు కౌన్సిలర్ అంజలి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు

కౌతాళం: ప్రజల ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, ఆంధ్ర ప్రజల ఆరోగ్యాన్ని ఆయన బాధ్యతగా తీసుకున్నారని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొదలకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ప్రభుత్వం గ్రామాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందించాలన్నా అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆయా కుటుంబాల వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తోందని వివరించారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని, ప్రజల దీవెనతో వైఎస్ జగన్ మరోసారి సీఎం కావడం ఖాయమన్నారు. ప్రజాధనాన్ని కాజేసి జైలుకు వెళ్లిన తెలుగుదేశం అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా నాయకులు అనేక కార్యక్రమాలు చేపట్టడం విచారకరం అన్నారు. అలాగే గురువారం ఎమ్మిగనూరులో జరిగే ముఖ్యమంత్రి సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పాల్గొనాలని కోరారు. శిబిరంలో కంటి అద్దాలు, ఆయుష్మాన్ కార్డుల్ని పంపిణీ చేశారు. నాయకులు అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ప్రహ్లాదచారి, మహబుబ్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ చావిడి ప్రారంభం

పొదలకుంట గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన గ్రామ చావిడిని హాల్వి మంఠం తాత మహంత స్వామితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. హోచ్చళ్లి తాత మఠం పీఠాధిపతి రుద్రముని స్వామి, పలువురు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బసాపురం గ్రామంలో ఎంపీడీఓ గీతావాణి, సర్పంచ్ ఈరమ్మ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నీలోఫర్, ఇమ్రాన్, జుబేరియా, మయూర్‌కుమార్, పుష్పలత, సురేష్ 400 మందికి పైగా రోగులను పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రకళావతి భాయి, ఎంపీహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమా రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెట్నే హళ్లి గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి సమావేశం నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదవాడికి సైతం కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించడం అభినందనీయమని ప్రతిఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, డాక్టర్లు గోవిందమ్మ,అశోక్, సర్పంచ్ అంజి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యదర్శి నాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌కుమార్ సమక్షంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆ సచివాలయం పరిధిలో జంపాపురం, ఐరన్‌గల్లు గ్రామాల నుంచి ఓపీ ద్వారా 417 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటీస్, మలేరియా, హెచ్‌బీ, బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించారు. అలాగే ఉచిత కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి కళ్లద్దాలు అందించారు. గ్రామానికి చెందిన వలంటీర్ బసప్పనాయుడు నడవ లేని వారి కోసం ఐరన్‌గల్లు, జంపాపురం గ్రామాల నుంచి సొంతంగా వాహనం ఏర్పాటు చేసి వైద్య శిబిరానికి తరలించి చికిత్స అనంతరం తిరిగి ఇంటికి చేర్చారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు నజీర్ అహ్మద్, అభిరూప్, ఫిజీషియన్ సబిఉల్లా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బసాపురంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు



జంపాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



జంపాపురంలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

కాళ్ల నొప్పులకు మందులు ఇచ్చారు



మా గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలందించడం సంతోషంగా ఉంది. శిబిరానికి పెద్ద డాక్టర్లు వస్తారని చెప్పడంతో మా గ్రామంతో పాటు పక్కనే ఉన్న ఐరన్‌గల్లు గ్రామ ప్రజలు కూడా ఇక్కడికి వచ్చి చూపించుకున్నారు. నాకు కాళ్ల నొప్పులు, బీపీ చెక్ చేసి ఉచితంగా మందులు అందించారు.

– హనుమంతు, జంపాపురం

కంటి పరీక్షలు చేశారు



ఇటీవల ఒక కంటికి ఆపరేషన్ చేయించుకున్నాను. మళ్లీ కళ్లు మసకగా కనిపిస్తున్నాయి. గ్రామానికి వచ్చిన డాక్టర్లు కంటి పరీక్ష చేసి మందులు అందించారు. కంటి అద్దాలు ఇస్తామన్నారు. చాలా సంతోషంగా ఉంది. గతంలో గ్రామంలోకి డాక్టర్లు వచ్చే వారు కాదు. ఇప్పుడు గ్రామంలో ప్రజల వద్దకు డాక్టర్లు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సేవలు మరువలేనివి.

– మల్లయ్య స్వామి, జంపాపురం

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పరీక్షించి ఆరోగ్య వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలున్న వారిని ప్రభుత్వం నిర్వహించే వైద్య శిబిరాల్లో చికిత్స పొందాలని సూచిస్తున్నారు. నేడు ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో జరిగే సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు బుధవారం విడుదల చేశారు.

మండలం	గ్రామం	స్థలం
ఆదోని పట్టణం	మేదరగేరి	భీరప్ప టెంపుల్
ఆదోని	విరుపాపురం	గ్రామ సచివాలయం
కోసిగి	అగసనూర్	ప్రాథమిక పాఠశాల
కౌతాళం	చిరుతపల్లి	గ్రామ సచివాలయం
మంత్రాలయం	ముగతి	గ్రామ సచివాలయం

ప్రారంభోత్సవానికి సిద్ధం





దుద్దిలో నిర్మాణం పూర్తయిన సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనం

కోసిగి: ప్రజల వద్దకు పరిపాలన అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారు. పరిపాలన సౌలభ్యం కోసం గ్రామాల్లోనే సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా కోసిగి మండలంలోని దుద్ది గ్రామంలో రూ.43.50 లక్షలతో సచివాలయం, రూ.21.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ప్రభుత్వం భవన కార్యాలయాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభానికి సంసిద్ధం చేశారు. త్వరలోనే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేపడుతున్నట్లు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు దుద్ది నాగేష్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న సెబ్ సీఐ

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, ముగ్గురు నిందితులను అరెస్ట్ చూయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు వేర్వేరుగా కర్ణాటక మద్యం తరలిస్తు పట్టుబడినట్లు చెప్పారు. ఆదోని మండలం జాలమంచి గ్రామానికి చెందిన గవిగట్టు మహేంద్రమ్మను అరెస్ట్ చేసి 432 (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లు, అలాగే ఆదోని మండలం పెద్దతుంబళంకు చెందిన మఠం సుజాతను అరెస్ట్ చేసి 96 మద్యం ప్యాకెట్లు, పెద్దకడుబూరు మండలం గవిగట్టుకు చెందిన కోసిగి హనుమంతును అరెస్ట్ చేసి 96 టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు కేసుల్లో పట్టుబడిన మద్యం మొత్తం విలువ రూ.35 వేలు ఉంటుందని చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తున్నా, విక్రయిస్తున్నట్లు తెలిసినా (సెబ్ సీఐ సెల్ 9440902579) నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో చెక్ పోస్ట్ సీఐ శ్రీరాములు, సెబ్ హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి





పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, హాజరైన ప్రజలు, మహిళలు

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 4వ వార్డు కిలిచిన్‌పేటలో కౌన్సిలర్ సాకరే ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 45–60 ఏళ్ల మహిళలకు ఏడాదికి రూ.18,750, అమ్మ ఒడి ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు, పిల్లలకు అక్కాచెల్లెమ్మలకు మేనమామగా ఉంటూ అన్నివిధాలుగా ఆదుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనివిధంగా ఆదోనిలో 10 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, అలాగే అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఏడు రకాల ఆరోగ్య పరీక్షలను ప్రజల ఇంటి వద్దనే చేస్తూ వైద్యం అందిస్తున్నారన్నారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజలకు సేవలు మరింత మెరుగుపరిచేందుకు గృహసారథులను ఏర్పాటు చేశారన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు దొంగ కాబట్టే జైలులో ఉన్నాడని, టీడీపీ నాయకులు అక్రమ అరెస్టుగా పేర్కొనడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ఇన్నర్ రింగురోడ్డు, ఫైబర్ నెట్, స్కిల్ స్కాంలలో దాదాపు రూ.700 కోట్ల మేర అవినీతికి పాల్పడినట్లు ప్రభుత్వరంగ సంస్థలే ఆధారాలతో నిరూపిస్తున్నారన్నారు. వార్డు ఇన్‌చార్జ్ ఆనంద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గోవిందు, లక్ష్మీనారాయణ, దస్తగిరినాయుడు, గైక్వాడ విశ్వనాథ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

హొళగుంద: రబీ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులకు బుధవారం హొళగుంద–3 రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ పప్పుశనగ విత్తనాల పంపిణీ జరిగింది. ఆర్బీకేలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏఓ ఆనంద్ లోకదళ్, అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు చైర్మన్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషప్ప, పంపాపతి, సాయిబేష్, హనుమప్ప తదితరులతో పాటు వీఏఏ సుంకమ్మ, మణీశ్రీ పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి 1,551 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని 40 శాతం సబ్సిడీ పోనూ రైతులకు క్వింటం విత్తనాలు రూ.4,860కు అందిస్తున్నట్లు చెప్పారు.

హంద్రీ–నీవా నీటి మళ్లింపుతో కరువు దూరం



రాతన చెరువులోకి పారుతున్న నీటిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి: హంద్రీ–నీవా ద్వారా చెరువులకు నీటిని మళ్లిస్తుండడంతో కరువు దూరమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పైపులైన్ ద్వారా రాతన చెరువులోకి పారుతున్న నీటిని వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాచప్ప, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, యువ నాయకులు ఉమామహేశ్వర రెడ్డి బుధవారం పరిశీలించి గంగమ్మ పూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గతంలో ఎంతో మంది పాలకులు చెరువులకు నీళ్లిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారే తప్ప హామీని నిలబెట్టుకోలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృషితో మండలంలో అన్ని చెరువులకు నీటి మళ్లింపు కార్యక్రమం వేగంగా జరుగుతోందన్నారు. నీటి మళ్లింపుతో ఆయకట్టు సాగుతో పాటు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య తీరుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, కోదండ, బసవరాజు పాల్గొన్నారు.



తమలపాకుల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



ముత్యాల అలంకరణలో పేట వీరభద్రేశ్వర స్వామి



గాయత్రీదేవి అలంకరణలో మాతాపరమేశ్వరి దేవి



అర్ధనారీశ్వరీ అలంకరణలో వాసవీకన్యకాపరమేశ్వరి దేవి



వాసవీమాత ఆలయంలో స్వామివారు



సంతానలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ



ధనలక్ష్మి అలలంకరణలో దుర్గాదేవి

గాయత్రీ దేవి పాహిమాం

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం ఆయా అమ్మవార్ల ఆలయంలో కొలువుదీరిన విగ్రహాలు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు అర్ధనారీశ్వరి, గాయత్రీదేవి, పంచముఖ గాయత్రీదేవి, లలితాపరమేశ్వరిదేవి, ముత్యాల, తమలపాకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున అమ్మవార్లకు ఆలయ, మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా హోమాలు, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు.

మంత్రాలయం: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఆర్యవైశ్య సేవా సంఘం కల్యాణ మండపంలో దుర్గాదేవి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. పురోహితుడు గౌతమ్‌స్వామి నేతృత్వంలో అధ్యక్షుడు నారాయణశెట్టి ఆధ్వర్యంలో రూ.1.5 లక్షల విలువ చేసే రూ.50 కరెన్సీ నోట్లతో దుర్గామాతకు అలంకరణ చేశారు. సాయంత్రం శ్రీనివాసకల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత మంచాలమ్మ సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామ శివాలయంలో వెలసిన పార్వతిదేవి అమ్మవారు బుధవారం లలితా మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని కాళికాదేవి, చౌడేశ్వరిదేవి లక్ష్మీదేవిగా, అన్నపూర్ణదేవిగా భక్తులకు కనువిందు చేశారు. ఆలయ పూజార్లు వీరభద్రయ్య, నరసింహాచారి ఉదయం అమ్మవార్లకు కుంకుమార్చన, బిల్వార్చన, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవీ దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజున అమ్మవారు కూష్మాండ దుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ఆలయంలో అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ గావించారు. వెండికవచ అలంకరణలు, ఫల, పుష్పాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందు ప్రచార ధర్మ పరిషత్ కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక ఆధ్మాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ధార్మిక ప్రవచనాలు నంద్యాలకు చెందిన శ్రీ ఎం.మద్దయ్యస్వామి చేత మూడు రోజుల పాటు రామాయాణం, భారతం, భగవద్గీతపై ఉపన్యాసాలు చేపట్టారు. ఈ ఉపన్యాసాలు మూడు రోజుల పాటు కొనసాగించి ఈనెల 20న ఉదయం 8.30 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణలో గోపూజ, కుంకుమార్చన కార్యక్రమంతో ముగించనున్నారు.



కూష్మాండ దుర్గ అలంకరణలో శాంభవి దేవి



లలితా మాతగా దర్శనమిస్తున్న కాళీమాత